

# ఎన్.టి.ఆర్ పురాణ పాత్రలు

## – డా. నందమూరి లక్ష్మీపార్వతి



డా.లక్ష్మీపార్వతిగారు డాక్టరేట్ కోసం సమర్పించిన సిద్ధాంతగ్రంథం **'ఎన్.టి. ఆర్ పురాణపాత్రలు – భారతీయ పురాణ సంప్రదాయం చలనచిత్ర శైలీకరణ'** నుంచి ఎంపిక చేయబడిన కొన్ని భాగాలు – కౌముది పాఠకులకోసం ప్రత్యేకం..!!

*(గత సంచిక తరువాయి)*

## ప్రత్యేక ఇంటర్వ్యూలు

*(**డా.ఎన్.టి.ఆర్ గారితో** సాన్నిహిత్యం కలిగి, వారితోపాటు చిత్రరంగంలో కృషి చేసిన ప్రముఖులతో ముఖాముఖీలు ఈ పరిశోధనా కార్యక్రమంలోని క్షేత్రపర్యటన సందర్భంగా సేకరించినవి)*

### పద్మభూషణ్ శ్రీమతి బి.సరోజాదేవి.

### సుప్రసిద్ధ సినీ నటి.

"**నన్ను** మొదట ఇంట్రడ్యూస్ చేసింది రామారావుగారే. పాండురంగ మహాత్మ్యంలో వారిని చూసి అబ్బ ఎంత బాగున్నారో అనుకున్నాను. ఆయనతో ఫ్రీగా చెయ్యాలంటే భయపడ్డాను. రెండో పిక్చర్ సీతారామ కళ్యాణం. అందులో మండోదరి వేసాను. ఆ పిక్చరుకు అవార్డు కూడా వచ్చింది. తరువాత తమిళంలో బిజీ అయ్యాను. హిందీలో, కన్నడంలో నాకింత పేరు రావటానికి అన్నయ్యే కారణం. ఆయన నా గురువు కూడా. అన్నింటికంటే నాకు నచ్చిన చిత్రం 'శ్రీకృష్ణార్జున యుద్ధం', అందులో సుభద్రగా... వారు కృష్ణవేషంలో వస్తే అన్నయ్య అని పిలవటం.. నాకు నిజంగా ఆ అన్నయ్య పిలుపే స్థిరపడిపోయింది. తరువాత శకుంతల పిక్చరు ఊటీలో షూటింగ్. అన్నయ్యగారు 5.30కల్లా వచ్చేసారు. నాది లేటవుతుండేది. ఆడవాళ్ళ ఇబ్బందులు వారికి తెలుసు. నన్ను సరోజగారూ అని పిలిచేవారు. ఆ పిక్చరు నాకు చాలా ఇష్టం. ఇకొకటి 'దానవీరశూరకర్ణ', వారి సొంత చిత్రం. తెల్లవారుజామున ట్రంకాల్ చేశారు. నేను ఎవరు మీరు అన్నాను. " నేనమ్మా మీ అన్నయ్యను. నా పిక్చరులో మీరు యాక్ట్ చేయాలి. ఇందులో మూడు కారక్టర్స్ ఉన్నాయి. కృష్ణుడు, దుర్యోధనుడు, కర్ణుడు ఏది కావాలో ఫస్ట్ నువ్వే నిర్ణయించుకో, తర్వాత మిగిలినవి నిర్ణయిస్తాను" అన్నారు.

ఏదయినా మీ భార్యగానే యాక్ట్ చేయాలని అన్నాను.

"అయ్యో భార్య పాత్రలు చిన్నవమ్మా" అన్నారు. అయినా ఫర్వాలేదు. ఒక్క సీన్‌లో వచ్చినా భార్యగానే చేస్తాని అని అన్నాను. కర్ణుడి భార్యగా వేసాను. ఆ పిక్చరుకు అవార్డు వచ్చింది.

రామాంజనేయ యుద్ధంలో ఆయన రాముడు నేను సీతగా వేసాను. ఆయనని నిద్రలేపాలి. నేను వచ్చి చూసాను. అలానే నిల్చుండిపోయాను. ఆ బ్లూ మేకప్పులో శ్రీరామచంద్రుడు నిద్రపోతున్నాడో ఏమో అనుకోవాలి. దిష్టి తగులుననిపించింది. ఇక అలా ఎవ్వరూలేరు. లో వాయిస్‌తో మాట్లాడేటప్పుడూ ఎంతో బాగా ఉండేది. ఆయనలాగా ఎవ్వరూ చెయ్యలేరు.

వారు లేరనే బాధ ఎంతో ఉంది. ఆయన గురించి ఒక పెద్ద బుక్ రావాలని కోరిక. అన్నయ్యగారి పురాణ పాత్రల గురించి లక్ష్మీపార్వతిగారు పి.హెచ్.డి చేస్తున్నారు. ఎందుకంటే ఆమె లక్ష్మీపార్వతే కాదు. ఆమె సరస్వతి కూడా. ఆమె చేతిలో సరస్వతి ఉంది. అందరూ తెలుసుకోవటానికి అన్నయ్య గురించి వ్రాసే ఈ బుక్ ఉపయోగపడుతుంది."

### *విక్టరీ మధుసూదనరావు*

### *సుప్రసిద్ధ సినీ దర్శకులు*

"రామారావుగారు ఏ పాత్ర ధరించినా ఆ పాత్రను క్షుణ్ణంగా అర్థం చేసుకుని నటించేవారు. ఇంకో విషయం ఏమంటే పాత్ర స్వరూప స్వభావాలను బట్టి ఆయన మానసికంగానే కాదు శారీరకంగా కూడా ఆ పాత్ర ఇమడటానికి ప్రయత్నించేవారు. ఉదాహరణకు భీముడి పాత్రలో బాగా తిని కండలు పెంచేవారు. అవే పేదవాడి పాత్ర ధరించాలనుకున్నప్పుడు తిండి మానివేసి బక్కగా కనిపించడానికి ప్రయత్నించేవారు. క్రమశిక్షణ కలిగిన సైనికుడిగా సినిమా రంగంలో ముందుకు పోతూ సాటి వారిని కూడా అదే మార్గాన పయనించేలా చేసిన యన్.టి.ఆర్ నిజంగా నా దృష్టిలో మార్గదర్శకుడే"

### *శ్రీమతి కృష్ణకుమారి*

### *సుప్రసిద్ధ సినీనటి.*

**ఎన్టీ.ఆర్** గారి కృష్ణుడు పాత్రలో అలా ఎంటరవుతుంటేనే మేమంతా లేచి నిల్చునేవాళ్ళం. మేముకూడా ఆర్టిస్టులమే. కానీ ఆయన్ను చూస్తే దేవుడే ఎంటరవుతున్నారనిపించేది. అది మాటల్లో చెప్పలేము. ఆయన డిసిప్లీన్. కృష్ణుడి పాత్రలో చాలా నియమంగా ఉండేవారు. పక్కన ఎవరన్నా సిగిరెట్టు తాగినా భరించేవారు కాదు. రాముడిగా, కృష్ణుడిగా అన్ని పాత్రలు ఆయన తప్ప మరెవ్వరు పుట్టరు. పుట్టబోరు అనిపిస్తుంది.

మొదట యన్.ఎ.టి పిక్చర్స్‌లో పిచ్చి పుల్లయ్యలో యాంటీ వేషం వేసాను. ఆయన పక్కన రుక్మిణిగా నటిస్తుంటే నిజంగా రుక్మిణిని అనిపించేది. దేవుళ్ళ వేషాల్లో, ఆ భావన కలిగేది. ఇప్పటికీ పాత సినిమాలు చూస్తుంటే చాలా ఆనందంగా ఉంటుంది. వారి

పక్కన 25 సినిమాల వరకు యాక్ట్ చేశాను. దేవుళ్ళ పాత్రలు మాత్రం ఆయనలాగా ఇక ఎవ్వరూ ఉండరు. పక్క ఆర్టిస్ట్‌తో ఆయనెంత కేర్‌ఫుల్‌గా ఉంటారంటే 'లక్షాధికారి' షూటింగ్ అవుతుంది అప్పుడు అడయార్‌లో సముద్రంలో ఒక సాంగ్. నీళ్ళలోపలికి వెళ్ళాలి. ఒక పెద్ద అలవచ్చి ముంచేసింది. రామారావుగారు చెయ్యి గట్టిగా పట్టుకుని ఉండకపోతే ఇప్పుడు ఇలా ఉండేదాన్నికాను."

## శ్రీమతి శంకరమంచి జానకి (షావుకారు)

## సుప్రసిద్ధ సినీనటి

"నేను మొదట రామారావుగారితో 'షావుకారు' సినిమాలో నటించాను. నాకు తగిన పర్సనాలిటీ లేకపోవటం వలన కేవలం సాంఘిక సినిమాలకే పరిమితమయ్యాను. అయితే వారిని గురించి చెప్పాలంటే రాముడు, కృష్ణుడు, వేంకటేశ్వరస్వామి ఇలాగే ఉండేవారు, వీరేవారు. రామారావుగారొక పాత్రని మీద వేసుకునో, లేదా నటించారనటం సరికాదు. ఆ పాత్ర బాగా పోషించారనటం కంటే స్టుపిడిటీ ఇంకోటి లేదు. ఎందుకంటే రామ, కృష్ణ గోవిందులను రామారావుగారిలో చూసుకున్నాం. వారికి వారే సాటి. ఆ డిగ్నిటీ, హుందాతనం, ఆ వాయిస్ మరెవ్వరు చేస్తే వచ్చేవికావు. వారినెప్పుడూ ఆరాధించే ఆడపడుచును నేను. ఆ సెట్ మీద వారికుండే డెడికేషన్, కంట్రోల్ ఆఫ్ హోల్ సిచ్యుయేషన్, తన పాత్రే కాక ఇతర పాత్రల పట్ల వారు తీసుకునే శ్రద్ధ వారిలో ఉన్న ప్రత్యేకత. వృత్తిపై నున్న ఆ శ్రద్ధ మరెవ్వరిలో లేవు. ఆ గ్లోరీ, యశస్సు దానికి డెడికేషన్ కారణం. ఇప్పటికీ మేము దేవుడి సినిమాలు చూడాలంటే వారి సినిమాలే. వారు తప్ప ప్రపంచంలో మరెవ్వరూ లేరని నా నమ్మకం."

## డాక్టర్ దాసరి నారాయణరావు.

"నటుడిగా ఆయన గొప్పతనం చెప్పాలంటే ఆయన పోషించిన రావణాసురుడు, దుర్యోధనుడు, యముడులాంటి ప్రతినాయక పాత్రల గురించి చెప్పుకోవాలి. వాటికి ఉదాత్తతను కల్పించి పురాణాలను మార్చి ఒప్పించిన మహానటుడాయన. క్రమశిక్షణకు కృషికి, దీక్షకు ఎన్.టి.రామారావును మారుపేరుగా పేర్కొనవలసి ఉంది. నిరంతర కృషీవలుడు, ఆయన ప్రతి చర్య ఒక ప్రయోగం. అందుకే విశ్వవిఖ్యాత నట రాజకీయ సార్వభౌముడు. "

( సమాప్తం)

Post your comments